సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 10 । మార్చి । 2024

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన సురేష్ షెట్కార్



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినందుకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఉమ్మడి మెదక్ జెడ్పీ ప్రణాళికా సంఘం సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్‌తోపాటు సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నాసిరకం భోజనం



విద్యార్థుల కోసం వండిన అన్నం

హత్నూర(సంగారెడ్డి): నాసిరకం భోజనం పెట్టారని విద్యార్థులు ఆందోళన చేసిన సంఘటన మండల కేంద్రమైన హత్నూర గురుకుల పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. పాఠశాలలో సరిగా ఉడకని అన్నం పెట్టారని విద్యార్థులు ఆందోళనకు దిగారు. కొంతకాలంగా కూరలు రుచికరంగా ఉండటం లేదని పలు మార్లు ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. అన్నంలో రాళ్లు సైతం వస్తున్నాయని చెప్పారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సుధాకర్‌ను 'సాక్షి' ఫోన్లో సంప్రదించగా.. అన్నం కొంచెం మెత్తగా ఉడికిందని, కావాలనే మా పాఠశాలలోని కొందరు ఉపాధ్యాయులు రెచ్చగొడుతున్నారని ఆయన వివరించారు.

అందోల్‌లో వెయ్యేళ్ల నాటి శిల్పాలు



శిల్పాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువు ఒడ్డున నాగులకట్టపై ఉన్న శిల్పాలు వెయ్యేళ్ల నాటివని పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆయన శనివారం శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రంగనాథ స్వామి గోపురం ఎదుట రాష్ట్రకూటుల, కళ్యాణి చాళుక్యుల కాలం (క్రీ.శ. 9–10 శతాబ్దాలు), నాటి మహిషాసురమర్ధిని శిల్పాలు, నాగులకట్ట పై ఉన్న కళ్యాణి చాళుక్య, కాకతీయుల కాలంనాటి (క్రీ.శ. 11–13 శతాబ్దాలు) చెన్నకేశవ, జనార్ధన, నాగదేవతల శిల్పాలు, అలనాటి అద్భుత శిల్పకళా కౌశలానికి అద్దం పడుతున్నాయన్నారు. చెన్నకేశవ విగ్రహం చుట్టూ ఉన్న మకరతోరణం, శ్రీదేవి, భూదేవి, దశావతార శిల్పాలు చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. వీటితో ప్రదర్శనశాల ఏర్పాటు చేస్తే బాగుంటుందని శివనాగిరెడ్డి అన్నారు.

వైభవంగా రథయాత్ర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోహీర్(జహీరాబాద్): మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని ఓంకారేశ్వర మందిరంలో భగీరథీ నాగభూషణ దీక్షితులు సుహృద్భావ సంస్థ ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. శనివారం సాయంత్రం పుర వీధులగుండా వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఓంకారేశ్వర ఆలయ పీఠాధిపతి సద్గురు దక్షిణామూర్తి దీక్షితులు ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిచ మల్లికార్జున్ పాటిల్, ముత్తిరెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న పట్నం.. భక్తజన పరవశం

కొమురవెల్లి(సిద్దిపేట)/ఝరాసంగం(జహీరాబాద్): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శుక్రవారం జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అధికారులు, ఒగ్గుపూజారులు పెద్దపట్నం ఘనంగా నిర్వహించారు. తోటబావి వద్ద శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు పెద్దపట్నం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే కేతకి సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ మహాన్యాసఅభిషేకం వేద పండితులు, బ్రమణులు ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు జాగరణ చేశారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో నంది వాహన సేవ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



అన్నపూజ సందర్భంగా స్వామి ప్రత్యేక అలంకరణ



కొమురవెల్లిలో పట్నం దాటుతున్న అర్చకులు



ఝరాసంగం: కేతకీ ఆలయంలో జాగరణ చేస్తున్న భక్తులు

ఆచితూచి అడుగులు!

- ఎంపీ అభ్యర్థిత్వం కోసం సామాజిక, ఆర్థిక కోణాల్లో పరిశీలన
- జహీరాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి రేసులో గాలి
- పరిశీలనలో మరో ఇద్దరు పేర్లు
- నేడో రేపో ప్రకటన



గాలి అనిల్‌కుమార్



మల్కాపురం శివకుమార్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్..రెండు జాతీయ పార్టీలు ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించినప్పటికీ., గులాబీ పార్టీ మాత్రం ఇంకా అభ్యర్థి ఎంపిక విషయంలో లోతైన కసరత్తు చేస్తోంది. ప్రధానంగా సామాజిక కోణాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థి ఎంపికపై కసరత్తు జరుగుతోందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఎంపీ ఎన్నికలు ఖర్చుతో కూడుకున్నవి కావడంతో ఆర్థికంగా బలమైన నాయకుడిని రంగంలోకి దించే యోచనలో గులాబీ పార్టీ ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ ఇటీవల గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి కాషాయం కండువ కప్పుకున్న విషయం విధితమే. పార్టీలో చేరిన మూడు రోజుల్లోనే బీజేపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. మరోవైపు కాంగ్రెస్ కూడా మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. తొలి జాబితాలోనే జహీరాబాద్ టికెట్‌ను తేల్చేసింది.

సామాజిక కోణంలో..

కాంగ్రెస్, బీజేపీలు రెండు పార్టీలు కూడా లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన నాయకులను అభ్యర్థులుగా బరిలోకి దింపుతున్నాయి. జిల్లాలో లింగాయత్ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉంటారు. అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేయగల సామాజికవర్గాల్లో లింగాయత్ కూడా ఒకటి. ఈ రెండు పార్టీలు ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని ఎంపిక చేయడంతో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. మరోవైపు బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన బీబీ పాటిల్ ఆర్థికంగా బలమైన నాయకుడు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా కూడా ఢీకొనే స్థాయిలో ఉన్న నాయకుడి కోసం బీఆర్ఎస్ అన్వేషిస్తోంది.

అధినేత ఆశీస్సులెవ్వరికో..?

జహీరాబాద్ ఎంపీ టికెట్ రేసులో ప్రధానంగా గాలి అనిల్‌కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన మెదక్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన గాలికి మెదక్ పార్లమెంట్ పరిధిలో గట్టి పట్టుంది. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన్ను జహీరాబాద్ నుంచి బరిలోకి దించాలనే యోచనలో అధినేత కేసీఆర్ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు అనీల్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరిన విషయం విధితమే. ఆయనకు మెదక్ ఎంపీ టికెట్ కేటాయిస్తామని పార్టీలో చేరిక సమయంలో హామీ ఇచ్చారు. కానీ ఆయన్ను ఇప్పుడు జహీరాబాద్ నుంచి బరిలోకి దింపాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. మాజీ మంత్రి హరీష్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు కూడా అనిల్‌కుమార్ విషయంలో సానుకూలంగా ఉన్నారు. అధినేత కేసీఆర్ కూడా ఈయన వైపు మొగ్గ చూపుతున్నట్లు గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో అందోల్‌తో పాటు, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ఈ సామాజికవర్గం ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గాలిని బరిలోకి దించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌ల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి.

నేడో రేపో ప్రకటన

జహీరాబాద్‌తో పాటు మరికొన్ని పార్లమెంట్ స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులను అధినేత కేసీఆర్ ఒకటి రెండు రోజుల్లో ప్రకటించే అవకాశాలున్నాయి. తొలి జాబితాలోనే జహీరాబాద్ అభ్యర్థిత్వం ఉండే అవకాశాలున్నాయని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

• 80 రోజుల్లోనే.. పరిశ్రమలకు అనుమతులు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ఎఫ్లెంట్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న స్పీకర్, మంత్రులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి పాశమైలారం పారిశ్రామికవాడలో రూ.104 కోట్లతో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ కామన్ ఎఫ్లెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (జెడ్ఎల్డీ – సీఈటీపీ) ప్లాంట్‌ను నిర్మించారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం పాశమైలారం పారిశ్రామిక వాడలో జెడ్ఎల్డీ– సీఈటీపీ ప్లాంట్‌ను మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ వాతావరణ కాలుష్యం లేకుండా చేస్తుందని, దీన్ని ప్రారంభించుకోవడం మంచి పరిణామం అన్నారు. పాత ప్రభుత్వం సరిగా పని చేయలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తుంది ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. పరిశ్రమలకు సంబంధించి పదేళ్లలో దొరకని అనుమతులు 80 రోజుల్లో ఇచ్చేలా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ.. పరిశ్రమలకు సంబంధించిన భూముల్లో కమర్షియల్, రెసిడెన్షియల్ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అన్నారు. రూ.104 కోట్లతో ఈ ప్లాంట్ ఏర్పాటులో రాంకీ సంస్థ ప్రధాన పాత్ర పోషించడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వల్ల కాలుష్య నియంత్రణ జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక వాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నైపుణ్యం గల కార్మికులను తయారు చేయాలన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సాంకేతికతను ఉపయోగించి కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. వరంగల్‌లో కూడా పరిశ్రమల ఏర్పాటుకు ముందే ఇలాంటి ప్లాంట్ ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, ఆర్డీఓ వసంత కుమారి, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, బీడీఎల్ సీఐ రవీందర్, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి, కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, పారిశ్రామిక వేత్తలు దుర్గాప్రసాద్, చందు పాల్గొన్నారు.

సమన్వయ లోపంతో..

సమన్వయ లోపం కారణంగా జెడ్ఎల్డీ – సీఈటీపీ ప్రారంభ కార్యక్రమం చాలా ఆలస్యమైంది. ఉదయం జరగాల్సిన కార్యక్రమం మధ్యాహ్నం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు వస్తున్నారనే సమాచారంతో వివిధ శాఖల అధికారులు ఉదయం 9 గంటల లోపే ఇక్కడికి చేరుకున్నారు. కానీ మంత్రులు రావడం చాలా ఆలస్యమైంది. ముందుగా మంత్రి దామోదర్ రాజనర్సింహ చేరుకున్నారు. కొద్దిసేపటికి మరో మంత్రి కొండా సురేఖ వచ్చారు. వారిద్దరూ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్ బాబు కోసం వెయిటింగ్ చేయాల్సి వచ్చింది.

30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

వట్‌పల్లి(అందోల్): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం మండలంలో రూ.15.10 కోట్ల నిధులకు సంబంధించి అభివృద్ధి పనులకు శంకుస్థాన చేశారు. అందులో భాగంగా వట్‌పల్లిలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మహిళల పేరుమీద ప్రారంభిస్తామన్నారు. అనంతరం వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాలలో మంత్రి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సురేష్ షెట్కార్ ఉన్నారు.

మేమే మేటి.. మాకెవరు సాటి



'ఆకాశంలో సగం.. అవనిలో సగం' అన్నట్లు ఆ గ్రామ మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. స్వయం సహాయక సభ్యులుగా రుణాలు పొంది అప్పడాల నుంచి డ్రై క్లీనింగ్ వరకు వ్యాపారం కొనసాగిస్తున్నారు. పూల మొక్కలకు పుట్టిన రోజు చేస్తూ హరిత ప్రేమను చాటుతున్నారు. కోలాటాలు.. భజనలతో ఆధ్యాత్మిక స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తున్నారు. స్వేదం చిందించి.. మేధస్సు మరిగించి మహిళా శక్తిని చాటుతున్నారు. మెతుకు సీమలో మహిళా స్ఫూర్తికి చైతన్య దీప్తిగా నిలుస్తున్న 'లక్ష్మీనగర్' శ్రీ మంతురాళ్ల జీవన విధానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– పాపన్నపేట(మెదక్)

శ్రమైక జీవన సౌందర్యం

- లక్ష్మీనగర్‌లో వెల్లివిరుస్తున్న మహిళా చైతన్యం

ఇళ్లు.. అందాల లోగిళ్లు

ఏపీలోని గుంటూరు, ఒంగోలు, తెనాలి జిల్లాల నుంచి 1948– 50 మధ్య కొన్ని కుటుంబాలు వలస వచ్చి ఈ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. అందులో కంఠమనేని లక్ష్మీనర్సమ్మ– రత్తయ్య దంపతులు ప్రముఖులు కావడంతో ఆమె పేరు మీదే లక్ష్మీనగర్ గ్రామం పురుడు పోసుకుంది. అప్పట్లో రాళ్ల రప్పలతో కూడిన ఈ భూములు ఇప్పుడు రతనాల సీమగా మారాయి. ఎకరం భూమి ఎంత లేదన్నా రూ. 80 లక్షల నుంచి రూ. కోటిన్నర పలుకుతోంది. గ్రామం మొత్తం జనాభా 921 కాగా అందులో 473 మంది మహిళలే కావడం గమనార్హం.



కిరాణా కొట్టుతో లాభాలు

సుమారు 20 ఏళ్లుగా కిరాణం కొట్టు నడుపుతున్నాం. మొదట్లో కొంత ఇబ్బంది అనిపించినా.. ఇప్పుడు నేనొక్కదాన్నే షాపు నడుపగలుగుతాను. వర్కర్స్ సహాయంతో వ్యాపారం సాఫీగా సాగుతోంది. పిల్లల చదువులకు నా సంపాదనే వినియోగించా.

– ప్రవీణ, స్థానికురాలు



అప్పడాల నుంచి డ్రై క్లీనింగ్ వరకు

గ్రామంలో 16 స్వయం సహాయక గ్రూపులు 168 సభ్యులు ఉన్నారు. పాడిచన్‌పల్లి యూకో బ్యాంకు ఒక్కో గ్రూపునకు రూ. 20 లక్షల వరకు రుణాలు ఇచ్చింది. వీటితో ఇడ్లీలు, అప్పడాలు, పచ్చళ్లు, కిరాణం, డ్రై క్లీనింగ్, కిరాణం, పాల విక్రయ కేంద్రాలు, టైలరింగ్, క్యాటరింగ్ తదితర వ్యాపారాలను మహిళలే నడుపుతూ లాభాల బాటలో పయనిస్తున్నారు. సుమారు 15 మంది మహిళలు ఇడ్లీలు తయారు చేసి ఏడు పాయలతో పాటు మండలంలోని ఇతర గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తుంటారు.

గ్రామాభివృద్ధి కమిటీతో ప్రగతి



గ్రామాభివృద్ధి కమిటీ చొరవతో లక్ష్మీనగర్ రూపురేఖలు మారిపోయాయి. ప్రగతి సెంటర్ పేరుతో ఓ ఫంక్షన్‌హాల్ నిర్మించి దాని నుంచి వచ్చే ఆదాయంతో నీటి వృద్ధి ప్లాంట్, సీసీ కెమెరాలు, ఇంటి ముందు మొక్కల పెంపకంతో రోడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది.

కోలాటం.. భజనలు

పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడే మహిళలు సాయంత్రం కాగానే స్థానిక రామాలయం వద్దకు చేరుకొని కోలాటం, భజన కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆధ్యాత్మిక భావనలో మునిగి తేలుతారు. ముఖ్యంగా వీరి కోలాటం బహుళ ప్రాచుర్యం పొందింది. తిరుపతి, భద్రాచలం, భిక్కనూర్, యాదగిరిగుట్ట, కోటప్పకొండ, విజయవాడలకు వెళ్లి కోలాట ప్రదర్శనలిస్తూ ప్రశంసలు పొందుతుంటారు. అలాగే తిరుపతిలో సేవకు వెళ్తుంటారు.

టైలరింగ్, క్యాటరింగ్‌తో ఆదాయం

టైలరింగ్, క్యాటరింగ్‌తో కొంత ఆదాయం సంపాదిస్తున్నాం. ఐదుగురు మహిళలం కలసి క్యాటరింగ్ నిర్వహిస్తున్నాం. చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే శుభాకార్యాలకు అన్నిరకాల వంటలు సరసమైన ధరలకే అందిస్తాం.

– దుర్గ, 'లక్ష్మీనగర్





నోరూరించే పచ్చళ్లు తయారుచేస్తాం

నోరూరించే అన్ని రకాల పచ్చళ్లు తయారు చేస్తాం. సుమారు 30 ఏళ్లుగా ఈ రంగంలో ఉన్నా. ఫిష్, చికెన్, మటన్, నిమ్మ, టమాట, గొంగూర, టమాట, మామిడి ఇలా రకరకాల పచ్చళ్లు తయారు చేస్తాం.

– సామ్రాజ్యం, స్థానికురాలు



పూలమొక్కలు.. పాల నురగలు

గ్రామంలో సుమారు 150 ఇళ్లు ఉండగా ఇందులో పూల మొక్కలు.. కాయగూర తోటలు.. పాల నురగలు లేని ఇళ్లు లేదు. కోడి కూతతో నిద్రలేచే మహిళలు మొదట అడుగులు వేసేది పశువుల పాక వైపే. పాలు పితికిన తర్వాతే ఇంటి పనులు మొదలుపెడతారు. రోజుకు సుమారు 100 లీటర్ల వరకు పాలు అమ్ముతుంటారు. ఒకప్పటి పూరి గుడిసెలు ప్రస్తుతం అద్దాల మిద్దెలుగా రూపుదిద్దుకున్నాయి. ముఖ్యంగా ఈ గ్రామ మహిళలు పూల తోటలను ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటారు. ప్రతి ఏటా జూన్ 2న పూల మొక్కలకు పుట్టిన రోజు వేడుకలు జరుపుతారు.

సంబరాల సం'క్రాంతి'

సంక్రాంతి పర్వదినాన్ని ఇక్కడ ఘనంగా జరుపుకుంటారు. ఆ రోజునే కేక్ కట్ చేసి గ్రామ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు వివిధ ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు, గాలి పటాల పందెలు, భోగి మంటలు, పిండి వంటల పోటీలు జరుపుతారు.



క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లతో పోలీసులు

దుబ్బాకటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని వాగు నుంచి దుబ్బాకకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను దుబ్బాక శివారులో పట్టుకున్నట్లు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వాహనాల యజమానులు ఫరీద్, ఉపేందర్, శ్రీకాంత్, డ్రైవర్లు రమేశ్, సురేశ్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామం నుంచి అనుమతులు లేకుండా చేస్తున్నారనే సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని మద్దూరు పోలీసులకు అప్పగించారు.

బస్టాండ్‌లో మూత్ర విసర్జనకు వెళ్లి..

వలస కూలీ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తూప్రాన్: ఆర్టీసీ బస్టాండ్‌లో మూత్ర విసర్జనకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన కార్మికుడు ముజుందర్(47) తూప్రాన్‌లో పెయింటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా గొంతు ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో మూత్ర విసర్జన కోసం మూత్రశాలకు వెళ్లాడు. లోపలే పడి మృతి చెంది ఉండడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

● ఓల్డ్ ఈజ్ గోల్డ్

ఆరోగ్యానుగ..!

అధునిక యుగంలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. కల్తీ ఆహార పదార్థాలకు దూరంగా ఉంటున్నారు. పూర్వ కాలం నాటి ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. వాటి వాడుక వల్ల అనారోగ్యం బారినపడకుండా ఉండవొచ్చని గ్రహిస్తున్నారు. అందుకే సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.


\- సాక్షి, సిద్దిపేట

గానుగ నూనెకు యమ క్రేజ్..

- పూర్వకాలం నాటి నూనె వాడకంపై ఆసక్తి
- ధర ఎక్కువైనా కళ్ల ఎదుట తయారైన నూనె కొనుగోలు
- కల్తీ నూనెతో గుండె జబ్బులు
- కరోనా తర్వాత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


ఎద్దు గానుగ నూనె తయారు. (ఇన్‌సెట్లో) గానుగతో తయారు చేసిన నూనె




చెక్క రోలులో తయారైన నూనె

ఉరుకుల పరుగుల జీవితంలో కోవిడ్ దెబ్బతో ప్రజలు ఆరోగ్యం పై శ్రద్ధ పెడుతున్నారు. పాత కాలంలో ఆహార పదార్థాలు, నూనె కల్తీ లేనివి లభించేవి. దీంతో అప్పటి కాలం వారు ఎంతో ఆరోగ్యంగా జీవించేవారు. అదే ఇప్పుడు కల్తీమయమైన ఆహారాన్ని తిని చిన్న వయసులోనే గుండె జబ్బుల బారిన పడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటున్నారు. ప్రజలు స్వచ్ఛమైన ఆహార పదార్థాలను తినడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అందులో ముఖ్యమైనది ప్రతి రోజు వినియోగించే వంట నూనె. ప్రాచీన కాలంలో ఎద్దు గానుగతో పట్టిన నూనెను మళ్లీ ఇప్పుడు రుచి చూస్తున్నారు.

కళ్ల ముందే తయారు

ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్న కొద్దీ రసాయనాలు వాడకుండా తయారు చేసే కట్టె గానుగ నూనెలకు తిరిగి ఆదరణ పెరుగుతోంది. మార్కెట్‌లో లభించే వంట నూనెలు ఎక్కడో తయారు అవుతున్నాయి. అందులో ఏ కెమికల్ వాడుతున్నారో తెలియడం లేదు. చివరికి పల్లీలు, పొద్దుతిరుగుడు గింజలతో తయారు చేసే నూనెలను సైతం కల్తీ చేస్తున్నారు. దీంతో కళ్ల ముందే తయారయ్యే గానుగ నూనెను వినియోగిస్తున్నారు. సిద్దిపేటకు చెందిన ఓ యువకుడు ఎద్దు గానుగ ద్వారా నూనెను తయారు చేస్తున్నాడు. పల్లీలు, పొద్దుతిరుగుడు గింజలు, నువ్వులు, కొబ్బరిని వినియోగించి సంప్రదాయ పద్ధతులతో నూనె తయారు చేస్తున్నారు. చెక్క రోలులో నూనె కోసం గింజలు వేసి రోకలి పెట్టి కానికి ఎద్దును కట్టి తిప్పుతున్నారు. అది తిరగడం ద్వారా గింజలలో ఉండే నూనె బయటకు వస్తుంది. దానిని వడపోసి ప్రజలకు విక్రయిస్తున్నారు.

రెగ్యులర్ కస్టమర్లు ఉన్నారు



2019 సంవత్సరంలో ఆర్గానిక్ స్టోర్‌ను ఏర్పాటు చేశాం. ఎలాంటి కెమికల్ లేని పాత కాలం నాటి గానుగ నూనెను అందించాలనే ఉద్దేశంతో ఎద్దు గానుగ నూనె తయారీ యూనిట్‌ను 2020లో ఏర్పాటు చేశాం. మేము తయారుచేసే గానుగ నూనెకు రెగ్యులర్ కస్టమర్‌లు ఉన్నారు. కళ్ల ఎదుటే నూనెను తయారు చేసి అందిస్తున్నాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ గానుగ నూనెను తయారు చేస్తున్నాం.

\- మధుసూదన్ రెడ్డి, వేద ఆర్గానిక్స్ ఎద్దు గానుగ నూనె, సిద్దిపేట

కల్తీ లేని నూనె వాడుతున్నాం



కళ్ల ముందు తయారు చేసిన కల్తీ లేని పల్లీనూనెను వినియోగిస్తున్నాం. గతంలో నాకు రక్తం తక్కువగా ఉండేది. ఈ నూనె వంటలలో వినియోగిస్తున్నప్పటి నుంచి బాగా పెరిగింది. మనకు మార్కెట్‌లో లభించే నూనె ఎలా తయారు అవుతుందో తెలియదు. అదే మన ముందు తయారు చేస్తున్న స్వచ్ఛమైన నూనెను వాడుతున్నాం. ధర ఎక్కువైనా పర్వాలేదు గానుగ నూనెనే వంటల్లో వినియోగిస్తున్నాం.

\-పత్తిపాక మోహన్ బాబు, ఉపాధ్యాయుడు

కోర్ బ్రాంచ్‌లదే భవిష్యత్..

శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు


ఫైనల్ పోటీలను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ విష్ణురాజు, పక్కన నిర్వాహక కమిటీ ప్రతినిధులు

నర్సాపూర్: రాబోయే భవిష్యత్ కోర్ బ్రాంచ్‌లదేనని శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో ఈనెల 6నుంచి ప్రారంభమైన ఈ బాజా సై ఇండియా పోటీల్లో భాగంగా శనివారం ఫైనల్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను చైర్మన్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఐటీ రంగంలో ఉద్యోగాలకు కోతలు పెడుతున్నారని, కోర్ బ్రాంచ్‌లకు ప్రాముఖ్యం పెరుగనుందని వివరిస్తూ తమ కాలేజీల్లో కోర్ బ్రాంచ్‌లకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పోటీల్లో ఆకుర్డిలోని డివై పాటిల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగు కాలేజీ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని దక్కించుకోవడంతో రూ.లక్ష నగదు, బహుమతి అందజేశారు. పింప్రీ చించ్వాడ్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగు విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని గెలుచుకోవడంతో రూ.75 వేలు నగదు బహుమతి, భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగు కాలేజ్ ఆఫ్ ఉమెన్ కాలేజీ విద్యార్థినీలు తృతీయ స్థానంలో నిలువగా రూ. 50వేలు, మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సంజయ్ నిబందే, ఈ బాజా సలహాదారు (ఇండియా) కేసీ వోరా, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రతినిధి సుధీర్‌గుప్తా, ఆయా కంపెనీల ప్రతినిధులు, సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్తా, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఇతర ప్రతినిధులు కాంతారావు, బాపిరాజు, సతీష్ చంద్ర, సురేశ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


కిష్టయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం తున్కిఖాల్సాలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తున్కిఖాల్సాకు చెందిన రైతు మన్నె కిష్టయ్య(50)కు భార్య అనసూయ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. శుక్రవారం పొలం వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన కిష్టయ్య రాత్రి అయినా తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రదేశాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం తపాల్‌ఖాన్ చెరువు పక్కన కిష్టయ్య దుస్తులు ఉన్నాయని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా చెరువులో కిష్టయ్య మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి బురద, చేపల వలలో చిక్కుకొని బయటకు రాలేక ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడని మృతుడి కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





మురికి నీటిలోనే పుణ్యస్నానాలు

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఆలయం ప్రాంగణంలో మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఆలయ అధికారులు, పాలకమండలి నిర్లక్ష్యం కారణంగా కోనేరులోని మురికి నీటిలోనే భక్తులు పుణ్యస్నానాలు చేయాల్సి వచ్చింది. దీంతో నిర్వాహకులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

\-కె.సతీష్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

పొలానికి నీళ్లు పెడుతుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి


భిక్షపతి (ఫైల్)

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మాడాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాడాపూర్‌కు చెందిన రైతు నవాపేట భిక్షపతి (45) తనకు ఉన్న ఎకరం పొలానికి బోరు ఆన్ చేసి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. మోటార్‌కు ఉన్న సర్వీస్ వైరు నేలపై నుంచి పలుచోట్ల ధ్వంసం ఉండటంతో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నర్సమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య


భూపతి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె వద్ద చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె గ్రామానికి చెందిన పిల్లి భూపతి (42) వ్యవసాయం చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకుంటున్నాడు. చాలా రోజుల నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. హైదబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నరాల వీక్నెస్ ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ప్రతి రోజూ మదన పడుతుండేవాడు. దీంతో శనివారం పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దశదిన కర్మకు వెళ్లి వచ్చేలోపు..

68 తులాల బంగారం చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): మామ దశదిన కర్మకు వెళ్లి వచ్చేలోపే ఇంట్లో దొంగలు పడి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన మాదాసు రమేశ్ తన కూతురి పెండ్లి కోసం బంగారం ఇంట్లో దాచుకున్నాడు. ఈ నెల 6న తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లి గ్రామానికి చెందిన తన మామ బోబిల్ల సత్తయ్య దశదిన కర్మకు భార్యాపిల్లలతో కలిసి వెళ్లాడు. 8వ తేదీన తిరిగి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలి వెళ్లి చూడగా మంచం లోపల ఉన్న లాకర్ కప్ బోర్డులో 5 బిస్కెట్‌ల బంగారం (ఒక్క బిస్కెట్10 తులాలు), అల్మమారలో ఉన్న 18 తులాల బంగారం దొంగతనం జరిగినట్లు గుర్తించారు. కూతురు పెళ్లి కోసం బంగారం బంగారం దాచుకున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. వెంటనే మనోహరాబాద్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. తూప్రాన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో క్లూస్ టీంతో కలిసి వివరాలను సేకరించారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. నిజామాబాద్‌కి చెందిన హరీశ్, తోట ఆమని(30)కి 2019లో వివాహం జరిగింది. 18 నెలల కిందట అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడా సృజన లక్ష్మీనగర్‌కు వచ్చి నివాసం ఉంటూ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా హరీశ్, అతడి సోదరుడు వెంకటేశ్, కుటుంబ సభ్యులు అదనపు కట్నం రూ.10 లక్షలు తీసుకురావాలని ఆమనిని వేధిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వరకట్నం వేధింపుల విషయంలో బావ, అతడి సోదరుడు, కుటుంబ సభ్యులు వేధించడంతో తన సోదరి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరుడు నవతేజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై..

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హవేళీఘణాపూర్(మెదక్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ మండల పరిధిలోని మల్కాపూర్ తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ తండాకు చెందిన ధర్మ(56) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా మద్యం సేవిస్తూ ఇంట్లో గొడవలు పడుతున్నాడు. శనివారం ధర్మా అతిగా మద్యం సేవించి వచ్చి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు తలుపులు తీసి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శాంతి, కుమారుడు ఉన్నారు.

నిర్లక్ష్యానికి బీటలు



అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో రూ.5 లక్షలతో ఇటీవలే సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించడంతో బీటలు వారి, కూలిపోతుందని గ్రామస్తులు చెప్పారు. మండల పరిధిలోని చిల్వెర, ముప్పారం, ముస్లాపూర్ గ్రామాలలో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు.అధికారులు పర్యవేక్షించక పోవడంతో కాంట్రాక్టర్ల అవతారం ఎత్తిన పలువురు నాయకులే పనులు ఇష్టరాజ్యంగా చేపడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి నాణ్యతతో పనులు చేయించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సాధన చేసి.. సత్తా చాటు

రామాయంపేటలో 'ఖేలో ఇండియా' సైక్లింగ్ కేంద్రం

- ప్రతిరోజూ 32 మందికి శిక్షణ
- నేటి నుంచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు


సైక్లింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు


రామాయంపేటలోని ఖేలో సైక్లింగ్ కేంద్రం

రామాయంపేట(మెదక్): జిల్లాకు చెందిన సైక్లింగ్ క్రీడాకారులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడం కోసం రామాయంపేటకు ఖేలో ఇండియా సైక్లింగ్ కేంద్రం మంజూరు చేసింది. ఏడాది కిందట దీన్ని ప్రారంభించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అన్ని రకాల పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రానికి మొదటి విడతగా 19 జిల్లాలో ఖేలో ఇండియా సైక్లింగ్ కేంద్రాలు మంజూరుకాగా ఇందులో రామాయంపేట ఒకటి.

మెదక్ జిల్లాలోని రామాయంపేట ప్రాంతంలో సైక్లింగ్ క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఏడాది కేంద్ర ప్రభుత్వం ఈ కేంద్రం మంజూరు చేసింది. మండలంలోని దామరచెరువు గ్రామానికి చెందిన జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు దండు యాదగిరిని కోచ్‌గా నియమించారు. కార్యాలయం ఏర్పాటు నిమిత్తం స్థానికంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించారు. 32 క్రీడాకారులతో ప్రతిరోజూ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో కేంద్రం నుంచి రూ.5 లక్షలు మంజూరు కాగా ఎనిమిది శిక్షణా సైకిళ్లు కొనుగోలు చేశారు. అలాగే కార్యాలయంలో సీసీ కెమెరాలు, కంప్యూటర్లు ఏర్పాటు చేశారు.

అధిక సంఖ్యలో ఉండటంతో..



జిల్లాలోని రామాయంపేటలో సైక్లింగ్ శిక్షణా కేంద్రం కొనసాగుతుంది. ఈ ప్రాంతంలో సైక్లింగ్ క్రీడాకారులు అధిక సంఖ్యలో ఉండడంతో కేంద్రం మంజూరైంది. ఇందులో 32 మంది శిక్షణ పొందుతున్నారు. నాలుగేళ్లలో జాతీయస్థాయి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలి.

\- నాగరాజు, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి

రాష్ట్రస్థాయి పోటీలు..

కోచ్ ప్రతిరోజూ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారి హాజరు పట్టికను, శిక్షణకు సంబంధించి ఫొటోలను జిల్లా యువజన క్రీడాశాఖకు పంపించాలి. నాలుగేళ్లపాటు ఈ శిక్షణ కొనసాగుతుంది. ఈ క్రమంలో ఈ ఏడాది రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు రామాయంపేటలో నిర్వహించనున్నారు. ఆదివారం నుచి పోటీలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

జాతీయస్థాయికి ఎదగాలి



రామాయంపేటలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. ఈ మేరకు ప్రతి రోజూ శిక్షణ ఇస్తున్నాం. నేటి నుంచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు ప్రారంభం అవుతున్నాయి. అన్ని జిల్లాలకు చెందిన వంద మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారు.

\- దండు యాదగిరి, కోచ్, సైక్లింగ్ కేంద్రం